సాక్షి మంచిర్యాల

శనివారం । 14 । అక్టోబర్ । 2023



అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని గురుకుల విద్యాలయాల సంస్థ డిప్యూటీ కార్యదర్శి డి.వెంకటలక్ష్మి అన్నారు. చెన్నూర్‌లో జోనల్ స్థాయి పోటీలు ప్రారంభించారు. IIలో▸



శరన్నవరాత్రి ఏర్పాట్లు

బాసరలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ ఆలయ ఆవరణలో కొన్ని అసౌకర్యాలు భక్తులకు ఇబ్బందిగా మారాయి. IVలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /24.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా గాలులు వీస్తాయి.

గులాబీ దళంలో ఐక్యత!

- వెనక్కి తగ్గిన మాజీ ఎమ్మెల్యే 'గడ్డం'
- అంతా కలసి పని చేస్తామని ప్రకటన
- ఇక కిందిస్థాయిలో ఉన్న అసంతృప్తిపై దృష్టి
- సమన్వయం చేస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు సుమన్



సమావేశమైన ఎమ్మెల్యేలు సుమన్, దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండె విఠల్, అరవింద్‌రెడ్డి

జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గులాబీ పార్టీలో అసమ్మతి నాయకులు వెనక్కి తగ్గుతున్నారు. అధిష్టానం సూచనలతో తమ పట్టు వీడుతున్నారు. జిల్లాలో మంచిర్యాల బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి పార్టీ ఆదేశాలే శిరోధార్యంగా భావిస్తూ మరోసారి గెలుపునకు కృషి చేసేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం మంచిర్యాలలో గడ్డం అరవింద్‌రెడ్డి ఇంట్లో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఖానాపూర్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దండె విఠల్, కార్మిక నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం అయ్యారు. మంచిర్యాల సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చాలని అరవింద్‌రెడ్డి పట్టుబట్టిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన సిట్టింగ్ ఎమ్మెల్యే కోసం పని చేస్తామని ప్రకటించడంతో గులాబీ పార్టీలో ఐక్యత రాగం మొదలైంది. దీంతో మంచిర్యాల నియోజకవర్గంలో అసమ్మతి దాదాపు చల్లారినట్లేనని కార్యకర్తలు భావిస్తున్నారు. ఇక బెల్లంపల్లిలో టికెట్ ఆశించిన రేణికుంట్ల ప్రవీణ్‌కుమార్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించడంతో అక్కడ అసంతృప్తి చల్లారింది. ఇక క్షేత్రస్థాయిలో పట్టణ, మండల, గ్రామ స్థాయిలో ఉన్న నాయకులు, కార్యకర్తల్లో ఉన్న అసంతృప్తిని చల్లార్చేందుకు జిల్లా నాయకత్వం ప్రణాళికలు వేస్తోంది.

జిల్లాలో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలి : బాల్క సుమన్

మంచిర్యాల జిల్లాలో బీఆర్‌ఎస్ జెండా మళ్లీ ఎగరాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో పార్టీని గెలిపించేందుకు మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని తెలిపారు. శుక్రవారం మంచిర్యాలలో గడ్డం అరవింద్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలసి ప్రత్యేకంగా సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఎన్నికల సంబంధించిన సమాలోచనలు చేశామని చెప్పారు. అందరం సమన్వయంతో ముందుకు సాగుతామని, మరోమారు సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. సీఎం ఈ నెల 15న అభ్యర్థులకు బీ ఫాం ఇస్తారని, 17నుంచి నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టనున్నారని తెలిపారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల ప్రశాంతంగా ఉండాలన్నా, సమర్థవంతమైన అభివృద్ధి జరగాలన్నా బీఆర్‌ఎస్‌కే ఓటేయాలని అన్నారు. అరవింద్‌రెడ్డి గతంలోనూ, ప్రస్తుతం తమ గెలుపు కోసం పని చేస్తారని చెప్పారు. అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణిలో కార్మికులకు సీఎం కేసీఆర్ బోనస్ ఇచ్చారని, గతంలో వచ్చిన దానికి కన్నా 20వేల మెజార్టీతో దివాకర్‌రావును గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో రెండు స్థానాలకు బీసీలకే టికెట్లు ఇచ్చామని, విపక్ష పార్టీలు ఎన్ని సీట్లు ఇస్తాయో చూస్తామని అన్నారు.

అసంతృప్తులకే గెలుపు బాధ్యతలు

గత కొంతకాలంగా పార్టీలో అసంతృప్తిగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించే బాధ్యతలు అప్పగించారు. 'పురాణం'ను ముధోల్ నియోజకవర్గానికి ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించారు. ఇక అరవింద్‌రెడ్డికి మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావును గెలిపించేందుకు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని పార్టీ నుంచి ఆదేశాలు రావడంతో ఆయన కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే కోసం పని చేయనున్నారు. ఇక్కడ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ భానుప్రసాద్ ఉన్నప్పటికీ స్థానికంగా ఉన్న అరవింద్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడకముందే మంచిర్యాలలో ఈసారి ఎన్నికల్లో బీసీలకే బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వాలని పార్టీలో స్థానిక నాయకులు పట్టుబట్టడం, పలు కార్యక్రమాలు చేయడం తెలిసిందే. ఆ నాయకులకు అరవింద్‌రెడ్డి మద్దతు పలికారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. కొందరు పార్టీని వీడారు. ఇదే విషయాన్ని పలుమార్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి, కేటీఆర్ దృష్టి తీసుకెళ్లారు. చివరకు అభ్యర్థిని మార్చే ప్రసక్తే లేకపోవడంతో పార్టీలో వెనక్కి తగ్గారు.

మిల్లుల్లో ధాన్యం పక్కదారి?

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) ప్రక్రియలో కొందరు మిల్లర్ల అక్రమాలు ఆగడం లేదు. కొంతకాలంగా ధాన్యం పక్కదారి పట్టిస్తూ మిల్లింగ్ చేసి ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న విషయం తెలిసిందే. గతంలో చాలాసార్లు మిల్లర్లకు నోటీసులు ఇవ్వడంతోపాటు మిల్లులను బ్లాక్ లిస్టులో చేర్చారు. గత సీజన్‌లో కొన్ని మిల్లులకు సీఎంఆర్ ధాన్యం ఇవ్వలేదు. అయినా అవే అక్రమాలు కొనసాగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జిల్లాలో యాసంగి ధాన్యం నిల్వల్లో తేడాలు ఉన్నట్లు బయటపడుతున్నాయి. రెండు మిల్లుల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం కంటే తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ప్రభుత్వం యాసంగి సీజన్ ధాన్యాన్ని గ్లోబల్ టెండర్లు పిలిచి ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. టెండర్లలో పాల్గొనే వారు ముందుగా మిల్లులను సందర్శించి ధాన్యం నాణ్యత, నిల్వలను బట్టి ఆ లాట్ ప్రకారం టెండర్ వేస్తారు. ఈ క్రమంలో జిల్లాలోని కొన్ని మిల్లుల్లో ధాన్యం నాణ్యత పరిశీలనకు మహారాష్ట్రలోని గోండియా నుంచి కొందరు కాంట్రాక్టర్లు వచ్చి చూసే క్రమంలో హాజీపూర్, తాండూరు మండలంలో రెండు మిల్లుల్లో ధాన్యం నిల్వల్లో తేడాలు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం ఆరా తీశారు. సదరు మిల్లు యాజమాన్యం వేరే చోట ధాన్యం భద్రపరిచినట్లు సమాధానం ఇచ్చి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ధాన్యం ఎక్కడ ఉన్నా టెండరు వేసే నాటికి కచ్చితంగా ఆ లాట్‌లో ఉన్నంత మొత్తం చూపించాల్సి ఉండడంతో పక్కదారి పట్టించిన కొందరు మిల్లర్లు ఇప్పుడు ఏం చేస్తారనేది ఆసక్తిగా మారింది. ఇలాంటి అక్రమాలు జరగకుండా స్థానిక తహసీల్దార్లకు కూడా సీఎంఆర్‌పై పర్యవేక్షణ చేయాలని, మిల్లులను సందర్శించాలని సూచించినా నిఘా లేక రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.వందల కోట్లు ఖర్చు చేసిన ప్రజాధనంలో అక్రమాలు ఆగడం లేదు. అక్రమాలు చేసే మిల్లులపై జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుంటేనే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'అభివృద్ధే గెలిపిస్తుంది'

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధే వచ్చే ఎన్నికల్లో మళ్లీ భారీ మెజార్టీతో గెలిపిస్తుందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మందమర్రి పట్టణంలోని మూడో జోన్‌లో మందమర్రి పట్టణ, మండల స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ ఇంతవరకు అభ్యర్థులను కూడా ప్రకటించలేదని, ఆ పార్టీల్లో ఆశావహులు అధికంగా ఉన్నారని, టికెట్ రాని వారు బీఆర్‌ఎస్‌లోకే వస్తారని, ఆ పార్టీల వారిపై విమర్శలు చేయకూడదని పార్టీ శ్రేణులకు సూచించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగెర్ల మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రావు, జెడ్పీటీసీ వేల్పుల రవి, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



కండువా కప్పుతున్న ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో వివిధ పార్టీల నుంచి సుమారు 250 మంది మహిళలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, యూత్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట/దండేపల్లి: లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో దండేపల్లి మండలానికి చెందిన పలువురు టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీఆర్‌ఎస్ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, తాళ్లపేట ఉపసర్పంచ్ తిరుపతి, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఉన్నారు. కాగా, అంతకుముందు దండేపల్లి మండలంలో మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ, మండల నాయకులు ఎండీ ఆరీఫ్, చింత అశోక్, నాగభూషణం పాల్గొన్నారు.

గుండా మల్లేష్ బాటలో పయనిస్తాం



నివాళులు అర్పిస్తున్న శంకర్, నాయకులు

బెల్లంపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం గుండా మల్లేష్ చూపిన విప్లవ బాటలో పయనిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని సీపీఐ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ 3వ వర్ధంతి నిర్వహించారు. మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్యార్థి, యువజనులు, సింగరేణి కార్మికులు, మహిళల సమస్యలు, పౌర హక్కుల కోసం మల్లేష్ పాటుపడ్డారని అన్నారు. సీపీఐ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, ఆడేపు రాజమౌళి, చంద్రమాణిక్యం, బి.లక్ష్మీనారాయణ, ఎల్తూరి శంకర్, బియ్యాల ఉపేందర్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల్లో నిరాశ

మంచిర్యాలఅర్బన్: ఎన్నో ఏళ్ల తర్వాత ప్రకటించిన ఉపాధ్యాయ నియామక పరీక్షలు(డీఎస్సీ) వాయిదా పడ్డాయి. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ప్రకటించారు. నవంబర్ 20 నుంచి 30 వరకు పరీక్షలు జరగాల్సి ఉండగా వాయిదాతో అభ్యర్థుల్లో నిరాశ నింపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14న నిర్వహించిన టెట్ పేపర్–1లో 2,711 మంది, పేపర్–2లో 925మంది అర్హత సాధించారు. స్థానిక సంస్థల పాఠశాలల్లో 473 ఖాళీలు ఉండగా విద్యాశాఖ ప్రకటించిన ప్రకారం జిల్లాలో 113 ఖాళీలు చూపారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 36, భాషా పండితులు 16, పీఈటీ–3, ఎస్జీటీ 58 పోస్టులు ఖాళీగా వెల్లడించారు. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 21వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. నవంబర్ 20 నుంచి 30వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాల్సి ఉంది. జిల్లాలో ఖాళీలను తక్కువ చూపినా.. డీఎస్సీ ప్రకటన వచ్చిందనే సంతోషం కూడా వాయిదాతో ఆవిరైంది. మళ్లీ ఎప్పుడు డీఎస్సీ షెడ్యూల్ వస్తుందో..? అనే ఆందోళన అభ్యర్థులను వెంటాడుతోంది.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల ప్రచార, ఇతరత్రా కార్యక్రమాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల సంఘం అందించిన ధరలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖర్చుల వివరాలు నమోదు చేయాలి

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పక్షాలు విధిగా ఎన్నికల ఖర్చుల వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ సంతోష్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఖర్చుల పర్యవేక్షణ విభాగం, ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాలను అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ర్యాలీలు, బహిరంగసభలు, సమావేశాలు, రోడ్ షోలు ఇతరత్రా ఖర్చులను ఎన్నికల నియమావళి ప్రకారం లెక్కించాలని పేర్కొన్నారు. తహసీల్దార్ సుధాకర్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వకుంటే సహాయ నిరాకరణ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్‌లో టికెట్ల ప్రకటనకు ముందే టికెట్ రాకపోతే ఏం చేద్దామనే ప్రణాళికలు వేస్తున్నారు. రేపో, మాపో పార్టీ తొలి జాబితా ప్రకటిస్తున్న నేపథ్యంలో ఆశావహులు అప్రమత్తం అయ్యారు. మంచిర్యాల టికెట్ మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుకు ఇస్తే.. అవసరమైతే తామంతా పార్టీలో సహాయ నిరాకరణ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. మంచిర్యాల నియోజవర్గ టికెట్ మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుకే ఇచ్చే అవకాశం ఉందని వార్తాలు వస్తున్న నేపథ్యంలో ఈ స్థానంపై ఆశలు పెట్టుకున్న నాయకులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్, లక్సెట్టిపేట జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, డాక్టర్ నీలకంఠేశ్వరరావు, వంగల దయానంద్ శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని కేవీప్రతాప్ ఇంట్లో తమ కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. టికెట్ రాకపోతే ఆశావహులు అంతా కలసి కట్టుగా ఉండి గాంధీ భవన్‌లోనే తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం పార్టీ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే ఆధ్వర్యంలో ఏర్పాటైన కోఆర్డినేషన్ కమిటీని కలిసి పరిస్థితిని వివరించాలని చర్చించుకున్నారు. అందరం కలసి కట్టుగా ఉండి ఐక్యంగా ముందుకు పోవాలనే ఆలోచనలకు వచ్చినట్లు తెలిసింది.

ఇబ్బందులు తలెత్తకుండా పత్తి సేకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులు ఆధార్ బయోమెట్రిక్ పూర్తి చేసుకోవాలని, ఇబ్బందులు తలెత్తకుండా పత్తి సేకరణ చేపడుతామని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ, రవాణా, అగ్నిమాపక శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పత్తి కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రభుత్వ కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లాలో 1,54,525 ఎకరాల్లో సాగు కాగా 14.30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అన్నారు. అనంతరం ఆధార్ బయోమెట్రిక్, అనుసంధానంపై రైతులకు అవగాహన కల్పించే పోస్టర్లను మండల వ్యవసాయ, విస్తరణ అధికారులకు పంపిణీ చేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, డీపీఓ కల్పన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపాల్ పాల్గొన్నారు.

ఎంగిలి పూల బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చెన్నూర్: చెన్నూర్‌లోని బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో బ్రాహ్మణ మహిళలు శుక్రవారం ఎంగిలి పూల బతుకమ్మ నిర్వహించారు. తెలంగాణ సంప్రదాయం ప్రకారం ఎంగిలి పూల బతుకమ్మ అమావాస్య రోజున ఆడాల్సి ఉంది. అమావాస్యకు ముందు రోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకను బ్రాహ్మణ సమాజం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. బతుకమ్మ ఆట తర్వాత భజాభజంత్రీలతో పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణకు క్రీడలు దోహదం

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్
- బెల్లంపల్లిలో జోనల్ స్థాయి పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సంతోష్

బెల్లంపల్లి: విద్యార్థుల్లో శారీరక, మానసిక ఉల్లాసానికి, క్రమశిక్షణకు క్రీడలు దోహదపడుతాయని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శుక్రవారం సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీఓఈలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. సంక్షేమ గురుకులాల ఓఎస్డీ రమణారావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాల వెలికితీతకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడాస్ఫూర్తిని వదలకుండా ఆటల్లో పాల్గొనాలని సూచించారు. పోటీలకు కాళేశ్వరం జోన్ పరిధిలోని ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల నుంచి 935మంది సంక్షేమ గురుకుల విద్యార్థులు తరలివచ్చారు. మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులును కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, బెల్లంపల్లి తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జోనల్ గేమ్స్ ఓవరాల్ ఇంచార్జి దాసరి ప్రసాద్, ఆదిలాబాద్ డీసీఓ శ్రీనివాస్, సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాల్స్ లలిత కుమారి, జ్యోతి, సంధ్యారాణి, సంతోష్‌కుమార్, శ్రీనాథ్, వినోద్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరంతో బాలింత మృతి



రుచిత(ఫైల్)

జైపూర్: మండలంలోని రామారావుపేట గ్రామ పంచాయతీ పరిధి దుబ్బపల్లికి చెందిన బాలింత కామెర రుచిత(22) జ్వరంతో శుక్రవారం మృతిచెందింది. కొడుకు పుట్టిన 12 రోజులకే కన్నతల్లి ప్రేమను పంచకుండానే దూరమైంది. వివరాలిలా ఉన్నాయి. రుచితకు దుబ్బపల్లికే చెందిన కామెర సంతోష్‌కుమార్‌తో ఏడాది క్రితం వివాహమైంది. 12రోజుల క్రితం మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఆమె బాబుకు జన్మనిచ్చింది. వారం రోజుల తర్వాత ఇంటికి చేరింది. మూడు రోజులుగా రుచితకు జ్వరం వస్తుండడంతో గురువారం మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. రక్తకణాలు తగ్గాయని, డెంగీ పాజిటివ్ ఉన్నట్లుగా గుర్తించి కరీంనగర్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. కాగా, రుచిత తండ్రి లక్ష్మణ్ ఐదేళ్ల క్రితం మరణించాడు. తల్లి చంద్రమ్మ కూలీ పని చేస్తూ కూతురి వివాహం జరిపించింది. కొడుకు జన్మించిన సంతోషంలో ఉన్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం చోటు చేసుకుంది.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

- నేటి నుంచి బతుకమ్మ సంబరాలు
- మహిళలకు తొమ్మిది రోజుల పండుగ



మంచిర్యాల మార్కెట్‌లో బంతిపూల విక్రయాలు



బతుకమ్మ పేర్చుతున్న మహిళలు(ఫైల్)

దండేపల్లి/మంచిర్యాలఅర్బన్/చెన్నూర్: తెలంగాణలో ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ. దసరా ఉత్సవాలతో సమానంగా మహిళలు వైభవంగా నిర్వహించే వేడుక. దేశంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే పండుగకు సమయం ఆసన్నమైంది. భాద్రపద అమావాస్య రోజు నుంచి తొమ్మిది రోజులపాటు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తారు. శనివారం రోజున ఎంగిలిపూలతో ప్రారంభమై తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మతో ముగియనుంది.

తీరొక్క పూలతో..

ప్రకృతిలో సూర్యచంద్రులను కొలిచిన విధంగానే వివిధ రకాల పూలను కొలిచే పండుగ తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతోంది. తీరొక్క రంగుల పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ప్రజల కష్టసుఖాలను పాట రూపంలో పాడుతూ మహిళలు బతుకమ్మ ఆడుతారు. ఆడబిడ్డలను ఇళ్లకు ఆహ్వానించి కుటుంబమంతా సంబరాలు చేసుకుంటారు. బతుకమ్మ ఒక సామాజిక ఉత్సవం. కుల, మత, వర్గ, వృత్తి, ప్రాంత సంప్రదాయాలకు అతీతంగా బతుకమ్మ వేడుక నిర్వహిస్తారు. బతుకమ్మ పండుగ వారసత్వాన్ని ప్రపంచానికి చాటింది. భాద్రపద అమావాస్య రోజు ఎంగిలి పూల పేరుతో, ఎంగిలికాని పూలతో పేర్చిన బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజులు కొనసాగి దుర్గాష్టమి నాడు సద్దుల బతుకమ్మతో పూర్తవుతుంది. ప్రకృతిలో లభించే అన్ని రకాల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆడుతారు.

ఒక్కో రోజు.. ఒక్కోలా..

గునుగు, తంగేడు, పట్టుకుచ్చు, బంతి, చామంతి ఇలా రకరకాల పూలతో బతుకమ్మను పేరుస్తారు. మొదటి రోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అని పిలుస్తారు. అమ్మకు తులసి ఆకులు, వక్కలు నైవేద్యంగా సమర్పిస్తారు.

రెండో రోజు: బతుకమ్మను అటుకుల బతుకమ్మ అని పిలుస్తారు. ఇది ఆశ్వీయుజ మాసం మొదటి రోజైనపాడ్యమి రోజున నిర్వహిస్తారు. చప్పిడిపప్పు, బెల్లం, అటుకులు నైవేద్యంగా సమర్పిస్తారు.

మూడో రోజు: బతుకమ్మను ముద్దపప్పు బతుకమ్మ అంటారు. ఈ రోజున ముద్దపప్పు, బెల్లం, పాలు, ఇతర పాల పదార్థాలతో అమ్మకు నైవేద్యం సమర్పిస్తారు.

నాలుగో రోజు: నానబియ్యం బతుకమ్మను చేస్తారు. అంటే నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం వంటివి అమ్మవారికి సమర్పిస్తారు.

ఐదో రోజు: అట్ల బతుకమ్మ అంటారు. ఈరోజు అట్లు(దోసలు) తయారు చేస్తారు. అమ్మకు నైవేద్యంగా పెడతారు.

ఆరో రోజు: అలిగిన బతుకమ్మ అంటారు. ఈ రోజు బతుకమ్మ పేర్చరు. ఎలాంటి నైవేద్యం కూడా పెట్టరు.

ఏడో రోజు: వేపకాయల బతుకమ్మ అని పిలుస్తారు. సకినాల పిండిని వేపకాయల్లా తయారు చేసి, నూనెలో వేయిస్తారు. వాటిని అమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.

ఎనిమిదో రోజు: వెన్నముద్దల బతుకమ్మ అని పిలుస్తారు. నువ్వులు, వెన్నముద్ద, బెల్లం వంటి పదార్థాలు అమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.

తొమ్మిదో రోజు: సద్దుల బతుకమ్మ. చాలా ముఖ్యమైన రోజు. ఇదే రోజు అశ్వయుజ అష్టమి.. దుర్గాష్టమి. సద్దుల బతుకమ్మను పెద్ద బతుకమ్మ అని కూడా పిలుస్తారు. పెరుగన్నం, చింతపండు పులిహోర, లెమన్ రైస్, కొబ్బరి అన్నం నువ్వుల అన్నం అమ్మవారికి సమర్పిస్తారు. దీంతో బతుకమ్మ ఉత్సవాలను ముగిస్తారు.

సంతానం చల్లగా ఉండాలని..



బతుకమ్మ అంటేనే ఆడబిడ్డల పండుగ. పుట్టిన సంతానం చల్లగా ఉండాలని మహిళలు గౌరీదేవిని పూజిస్తారు. అక్కాచెల్లెళ్ల కోసం అన్నదమ్ములు పూలను సేకరించి తీసుకొస్తారు. రంగు రంగుల పూలలో ఆ దేవి కొలువై ఉంటుందని నమ్మకం.

– వేమారం మహేశ్వర్‌శర్మ, శివాలయం పురోహితుడు, చెన్నూర్

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం



గంజాయితో పోలీసులకు దొరికిన ప్రశాంత్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఏ క్యాబిన్ సమీపంలో శుక్రవారం గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఓ యుకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన సాగే ప్రశాంత్ మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మంచిర్యాలలో కొందరు యువకులకు ఎక్కువ ధరకు అమ్ముతుండేవాడు. ఎప్పటిలాగే శుక్రవారం గంజాయి విక్రయించేందుకు వచ్చి పోలీసులకు దొరికిపోయాడు. ప్రశాంత్ వద్ద నుంచి 226 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో టూ టౌన్ పోలీసులు గంజాయి పట్టుకున్నారు. టూ టౌన్ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పోలీసులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన బుడిమె నవీన్ నుంచి 100 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన గొర్లపల్లి ఫకీర్ (85) ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడు. బెల్లంపల్లి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ప్రభుత్వ దవాఖానకు వెళ్లడానికి ఐబీ తాండూర్ సమీపంలో ఫకీర్ రైలు పట్టాలు దాటుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కాలువలో పడి ఒకరి మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి గ్రామ సమీపంలోని ప్రాణహిత కాలువలో ప్రమాదవశాత్తు పడి కావుడే బాబురావు (52) మృతి చెందాడు. పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం ఇందిర్‌గాం గ్రామానికి చెందిన బాబురావు మూడురోజుల క్రితం మండలంలోని లోడుపల్లి గ్రామానికి చెందిన సమీప బంధువు దినకర్మకు వచ్చాడు. గ్రామస్తులతో కలిసి సమీపంలోని ప్రాణహిత కాలువ వద్దకు స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. దగ్గరలో ఉన్న బంధువులు కాపాడడానికి ప్రయత్నం చేసినా అప్పటికే నీట మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుడికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాల్క సుమన్

కోటపల్లి: లింగన్నపేటకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, టీఆర్ఎస్వీ నాయకుడు ఏరి నాగుల మల్లికార్జున్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తండ్రి ఓదెలును పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు, నాయకుడు విద్యాసాగర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులున్నారు.

మద్యం విక్రయాలపై నిఘా

- 2018 ఎన్నికల వేళ మద్యం విక్రయాలపై నజర్
- కోడ్ నేపథ్యంలో వైన్స్ యజమానులకు ఆదేశాలు
- మద్యం పంపిణీ కట్టడికి ఎక్సైజ్ శాఖ విస్తృత చర్యలు



మందమర్రిరూరల్: మార్కెట్‌లో శుక్రవారం పోలీసులు పట్టుకున్న మద్యం కాటన్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీల నాయకులు మద్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. దీంతో మద్యం పంపిణీని కట్టడి చేసేందుకు ఎక్సైజ్ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా పెంచారు. 2018 ఎన్నికల సమయంలో ప్రధానంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో మద్యం అమ్మకాలు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు కూడా అలాగే ఉండాలని వైన్స్ యజమానులకు ఎక్సైజ్ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మద్యం ఏరులై పారకుండా ఐఎంఎల్ డిపో నుంచి భారీ మద్యం కొనుగోలు చేయడానికి వీలు లేకుండా కట్టడి చేశారు. జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట లిక్కర్ డిపో పరిధిలో 208 మద్యం దుకాణాలు, దాదాపు 45 వరకు బార్లు ఉన్నాయి. ఇప్పటికే వీటిపై నిఘా పెంచారు. పరిమితికి మించి మద్యం నిల్వలు ఉంచినా, మద్యం తరలింపు చేపట్టినా ఎక్సైజ్, పోలీస్

చుక్క ఎక్కువైనా చిక్కే

శాఖలు పట్టుకుని సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేయనున్నారు. ఒక వ్యక్తికి పరిమితికి మించి మద్యం విక్రయించినా ఆ వైన్ దుకాణాలను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

నిరంతరం నిఘా..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే మద్యం అమ్మకాలపై నిరంతరం నిఘా పెట్టాం. మద్యం అమ్మకాలు గతంలోని అమ్మకాలను పోల్చి చూస్తూ మద్యం విక్రయాలపై దృష్టి సారించాం. మద్యం నియంత్రణ చేపడుతూ ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా చర్యలు చేపడుతున్నాం. మద్యం దుకాణాదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి. అక్రమ మద్యం రవాణా కట్టడికి రెండు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశాం. అక్రమ మద్యం నిల్వలు, సరఫరా అరికట్టేలా మూడు తనిఖీ బృందాలు ప్రత్యేకంగా గస్తీ చేపడుతున్నాయి. – నరేందర్, సీఐ, ఎక్సైజ్ శాఖ, మంచిర్యాల

ఎన్నికల 'కిక్' లేనట్లే..!

- నవంబర్ వరకు పాత దుకాణాలకు గడువు
- కొత్తగా వైన్స్ దక్కించుకున్న వారిలో నిరాశ

లెక్క తప్పింది

భైంసాటౌన్: కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి ఈసారి ఎన్నికలు నిరాశనే మిగిల్చనున్నాయి. మద్యం అమ్మకాలకు కిక్ ఇచ్చే దసరా పండుగ ఇదే నెలలో ఉండగా, నవంబర్‌లో ఎన్నికల ఉన్నాయి. నామినేషన్ వేసింది మొదలు పోలింగ్‌కు ముందు రోజు వరకు ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు నాయకులు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇక మందుబాబుల గురించి చెప్పనక్కర్లేదు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి రోజూ మందు, విందుల్లో మునిగి తేలుతారు. ఎన్నికలు వచ్చాయంటే చాలు మద్యం అమ్మకాలు విపరీతంగా పెరుగుతాయి. కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి మాత్రం నిరాశ తప్పేట్టు లేదు. ఎందుకంటే, నవంబర్ తరువాత డిసెంబర్‌లోనే కొత్త దుకాణాలు ప్రారంభం కానున్నాయి. నవంబర్ 30న పోలింగ్‌తో ఎన్నికల తంతు ముగియనుంది. పాత దుకాణాలకు నవంబర్ వరకు గడువు ఉండడంతో కొత్త దుకాణదారుల్లో నిరాశ నెలకొంది. ఎన్నికలు డిసెంబర్‌లోనే ఉంటాయనుకుని టెండర్‌లో దుకాణాలు రాని వారు రూ.లక్షల్లో గుడ్‌విల్ చెల్లించి దక్కించుకున్న వారున్నారు. ఇప్పుడు వారితోపాటు కొత్తగా దుకాణాలు పొందిన వారిలో నైరాశ్యం నెలకొంది.

ఒకే రోజు రెండు పార్టీల్లోకి జంప్



గురువారం మధ్యాహ్నం ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వెంకట్రామయ్య



గురువారం రాత్రి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న వెంకట్రామయ్య

అటు.. ఇటు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాలకు చెందిన రైతు సమితి మండల కన్వీనర్ తూముల వెంకట్రామయ్య గురువారం మధ్యాహ్నం బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే రోజు రాత్రి మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తనయుడు నడిపెల్లి విజిత్‌రావు సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. ఒక్క రోజే అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు మారి కండువాలు కప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు పూర్తయ్యే నాటికి ఇలాంటి వింతలు ఎన్ని చోటు చేసుకుంటాయో చూడాలి.

నెత్తిన టోపీ.. ఖద్దరు చొక్కా

ప్రత్యేకం..



గడ్డిగారి గడ్డెన్న, మాజీ మంత్రి

భైంసా: ముథోల్ నియోజకవర్గ వాసుల గుండెల్లో చిరకాలం నిలిచిన మాజీ మంత్రి గడ్డిగారి గడ్డెన్న ఎప్పుడూ నెత్తిన టోపీ.. ఖద్దరు చొక్కా కళ్లజోడుతో కనిపించేవారు. రాజకీయాల్లో అరంగేట్రం చేసిన నాటి నుంచి ఏనాడూ మరిచిపోలేదు. ఈ ప్రాంతం మహారాష్ట్రకు సరిహద్దున ఉండడం.. ఈ ప్రాంతంలో ఇప్పటికీ ఇలా సంప్రదాయబద్ధంగా టోపీ ధరించే వారు కనిపిస్తారు. గ్రామ సర్పంచు నుంచి ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన దివంగత నేత గడ్డి గారి గడ్డెన్న ఏనాడూ ఆ టోపీ ధరించడం మరిచిపోలేదు. ఎప్పుడు చూసినా ఆయన వద్ద ఇలాంటి టోపీలు కుట్టి సిద్ధంగా ఉంచేవారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతటివారినైనా ఆయన పేరు పెట్టి పిలిచేవారు. కాకాగా ఈ ప్రాంత వాసులకు చిరస్మరణీయులు అయ్యారు.

నగదు పట్టివేత



పోలీసులకు పట్టుబడిన నగదు

మంచిర్యాలక్రైం: హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన చెల్లం భీమయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2లక్షల నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీమయ్య ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రూ.2లక్షల నగదు మంచిర్యాల నుంచి దొనబండకు తీసుకువెళ్తుండగా స్థానిక ఐబీ చౌరస్తాలో నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలో పోలీసులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హన్మంత్‌రెడ్డికి అప్పగించినట్లు తెలిపారు.

కన్నెపల్లి మండల కేంద్రంలో..

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఒకరి నుంచి రూ.లక్ష పట్టుబడినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. సరైన పత్రాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఎఫ్ఎఫ్‌టీ టీమ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు బెల్ట్‌షాపులపై ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మార్కెట్ సమీపంలోని రాములమ్మ షాపులో సుమారు రూ.57వేల విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. యాపల్ ఏరియాలోని ఐలయ్య షాపులో రూ.52 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బెల్ట్‌షాపుల నిర్వహణ చట్ట విరుద్ధమని, నిర్వాహకులపై కేసులు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి చేశారు. రడగంబాల బస్తీకి చెందిన శనిగారపు జక్కులు వద్ద రూ.4,630, నంబర్–2 ఇంక్లైన్ బస్తీకి చెందిన నాయిని శేఖర్ వద్ద రూ.2,100 విలువ చేసే మద్యం సీసాలను ఎస్సై రమేశ్ పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

- గురుకుల సంస్థల డిప్యూటీ కార్యదర్శి వెంకటలక్ష్మి
- అట్టహాసంగా జోనల్ క్రీడా పోటీలు



బహుమతులతో విజేతలు

చెన్నూర్: విద్యార్థులు జోనల్ స్థాయి క్రీడా పోటీలను వేదికగా చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డిప్యూటీ కార్యదర్శి డి.వెంకటలక్ష్మి అన్నారు. చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శుక్రవారం ఆమె చెన్నూర్ తహసీల్దార్ ఈర్ల మల్లికార్జున్‌తో కలిసి 9వ జోనల్ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఆర్సీవో స్వరూపారాణి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కార్యదర్శి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే గురుకులాల క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. పోటీల్లో కాళేశ్వరం జోన్–1 పరిధిలోని జయశంకర్‌భూపాలపల్లి, కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 15 పాఠశాలల నుంచి 1,275 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమణి, డీసీవోలు బాలరాజు, భాస్కర్, పీఈటీలు, ప్రిన్సిపాల్స్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరుగుపందెం విజేతలు వీరే..

పరుగుపందెం పోటీలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. అండర్–14 విభాగంలో 600 మీటర్ల పరుగుపందెంలో ఎం.అలేఖ్య(లక్సెట్టిపేట) ప్రథమ, వేదశికం(ములుగు) ద్వితీయ, టి.లక్ష్మి(సిర్పూర్) తృతీయ, అండర్–17లో మూడు కిలోమీటర్ల పరుగుపందెం పోటీల్లో డి.రాణి(చిట్యాల) ప్రథమ, ఏ.ఆశ్రిత(లక్సెటిపేట) ద్వితీయ, ఎం.మౌనిక(ములుగు) తృతీయ, అండర్–19లో ఏ.అర్చన (నంది మేడారం) ప్రథమ, మయూరి(మందమర్రి) ద్వితీయ, పి.పూజిత(కాగజ్‌నగర్) తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలను ముఖ్య అతిథులు అందజేశారు.

కలప పట్టివేత



పట్టుబడిన కలపతో ఫారెస్ట్ అధికారులు

వాంకిడి: మండలంలోని పేవుట గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న కలపను శుక్రవారం పట్టుకున్నట్లు ఆసిఫాబాద్ ఎఫ్ఆర్వో అప్పలకొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నవేధని పంచాయతీ పరిధి పేవుట గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహించగా ఎడ్లబండిపై సీటి డ్రమ్ములో ఏడు టేకు దుంగలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన కలప విలువ రూ.8,900 ఉంటుందని తెలిపారు. కలప స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో సెక్షన్ అధికారి సత్యనారాయణ, బీట్ అధికారులు కామరాజ్, ఉమారాణి పాల్గొన్నారు.

లాభాల్లో వాటా ఇవ్వాలి



కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి మాట్లాడుతున్న శ్రీనివాస్

కాసిపేట: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని, అగ్రిమెంట్ అంశాలను అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై కాంట్రాక్ట్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 30వేల మంది కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వేతనాలు పెంచడం, అగ్రిమెంట్‌లోని అంశాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కనీస వేతన చట్టాల జీవోలు అమలు చేయకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. యాజమాన్యం సాధించిన రూ.2,222కోట్ల రూపాయల లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ లేదా? అని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ కార్మికులు రాజేశ్, సాయి, రమేశ్, మహేశ్ తదితరులున్నారు.

బెల్లంపల్లి: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ప్రకటించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి సివిక్ కార్యాలయం ఎదుట ఇఫ్టూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నాయకులు కృష్ణవేణి, వెంకటి, కొమురయ్య, భాను, సునీత, కరుణ, కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా వేతనాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఓదెలు

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ వద్ద శుక్రవారం బ్లాస్టింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో 22ను వెంటనే గెజిట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన కనీస వేతనాల జీవోలను వెంటనే అమలు చేసి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, హైకోర్టు ఇచ్చిన తీర్పును సింగరేణి యాజమాన్యం అమలు చేయాలని కోరారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి మరీ అధ్వానంగా మారిందన్నారు. కోర్టు ధిక్కార నేరానికి పాల్పడకుండా న్యాయస్థానాల తీర్పులను గౌరవించి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులు పర్వతాలు, చారి, రవి, వెంకటేశ్, కొమురన్న తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీరాంపూర్: లాభాల్లో వాటా చెల్లించాలని శుక్రవారం శ్రీరాంపూర్‌లోని పలు డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు విధులకు హాజరైన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం మాట్లాడారు. సింగరేణిలో 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కంపెనీ ఉత్పత్తి సాధనలో వీరు కూడా ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సంస్థకు వచ్చిన లాభాలను కాంట్రాక్ట్ కార్మికులకు కూడా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారే గాని కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. లాభాల్లో వాటా కూడా పంపిణీ చేయడం లేదని పేర్కొన్నారు. దీనిపై యజమాన్యం స్పందించి కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, సదానందం, అప్పారావు, శంకర్, తిరుపతి, రాజయ్య, రాజకళ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి క్రీడాకారులు కోల్ ఇండియా పోటీల్లో రాణించి సంస్థకు మరింత గుర్తింపు తీసుకురావాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ సూచించారు. గోలేటిటౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో శుక్రవారం నియర్‌బై ఏరియా హాకీ పోటీలు నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏరియా జీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థలో పని చేసే ఉద్యోగులు ప్రాంతాల వారీగా కాకుండా ఒకే కుటుంబంగా భావించి కోల్ ఇండియా పోటీల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, డీవైపీఎం తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, మందమర్రి జనరల్ కెప్టెన్ చిన్నన్న పాల్గొన్నారు.

విద్యుద్దీకరణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేస్తున్న రైల్వేట్రాక్ లైన్ విద్యుద్దీకరణ పనులను ఎస్టీపీపీ జీఎం చిన్న బసివిరెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందారం నజీర్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఇందారం మీదుగా శ్రీరాంపూర్ వెళ్తున్న రైల్వేట్రాక్ లైన్‌కు ఏర్పాటు చేస్తున్న విద్యుద్దీకరణ పనులు చూశారు. ట్రాక్ పక్కన ఏర్పాటు చేసిన రోడ్డు నుంచి వాహనాలను అనుమతించడం కుదరదని, ట్రాక్ విద్యుద్దీకరణ లైన్ ఏర్పాటుతో రైల్వేశాఖ అధికారులు సదరు రోడ్డుపై వాహనాల అనుమతి నిరాకరించారని తెలిపారు. స్థానికులు సహకరించాలని కోరారు. జీఎంతో డీజీఎంలు శ్రీనివాస్, ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, ఎస్‌వోటూ జీఎం వెంకటయ్య తదితరులున్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

జైపూర్: వ్యవసాయానికి సరిగా విద్యుత్ సరఫరా చేయడం లేదంటూ జైపూర్ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం మండల కేంద్రంతో పాటు దుబ్బపలి, వెంకట్రావుపల్లి, పెగడపల్లి, గంగిపల్లి, ఎల్కంటి గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. వారం రోజులుగా వ్యవసాయానికి విద్యుత్ కోత పెడుతున్నారని తెలిపారు. దీంతో పాలాలకు సరిగా నీరు అందడంలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేయాలని కోరారు.



ఆందోళన చేస్తున్న రైతులు

పత్రాలు చూపించినా నగదు సీజ్

- ఇప్పటివరకు రూ.53 లక్షలు పట్టివేత
- బాధితుల్లో 90మంది సామాన్యులే

మంచిర్యాలఅగ్రికల్చర్: ధ్రువీకరణ పత్రాలు చూపిస్తున్నా పోలీసులు నగదు సీజ్ చేస్తుండగా సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నుంచి నగదు తరలింపులో ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. దీంతో జిల్లాలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీల్లో ఇప్పటివరకు జిల్లాలో రూ.53.50 లక్షలు పట్టుకున్నారు. ఇందులో యూనివర్సల్ బ్యాంక్‌వి రూ.35 లక్షలు, హెచ్‌డీఎఫ్‌సీవి రూ.4 లక్షలు ఉండడం గమనార్హం. మెయిన్‌బ్యాంక్ నుంచి మరో బ్రాంచ్‌కు బ్యాంక్ వాహనంలో తరలిస్తున్న నగదు కూడా పట్టుకోవడం విశేషం. రెండ్రోజులుగా బ్యాంక్ అధికారులు, ఎన్నికల అధికారుల చుట్టూ తిరిగి నగదు విడిపించుకోవడం విడ్డూరం. ఈ రెండు బ్యాంకుల అధికారులు, ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్‌కు అన్ని ధ్రువీకరణ పత్రాలు అందజేసినా రోజుల తరబడి తిప్పించుకున్నారు. బ్యాంక్ అధికారుల పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల బాధలు మామూలుగా లేవు.

మచ్చుకు కొన్ని ఘటనలు

తన కూతురి పెండ్లి ఉందని రిటైర్డ్ సింగరేణి కార్మికుడు కుచపల్లి గంగారాం కూడబెట్టిన రూ.5లక్షలు స్టేట్‌బ్యాంక్ నుంచి విత్‌డ్రా చేసుకుని వస్తుండగా ఈ నెల 11న సీసీసీ పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దీంతో మూడురోజులుగా మంచిర్యాల ఆర్డీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నాడు. గాదె కిశోర్ అనే మేకల వ్యాపారి ఈ నెల 12న రూ.2.28 లక్షలు మంచిర్యాల ఎస్‌బీఐ నుంచి విత్‌డ్రా చేసుకుని వస్తుండగా పోలీసులు, ఎన్నికల సిబ్బంది పట్టుకుని సీజ్ చేశారు. అన్ని ధ్రువీకరణ పత్రాలు జతపరిచి కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బందికి అందజేసినా నగదు ఇవ్వడం లేదు. ఎన్నికల కమిషన్ నిబంధనల కారణంగా ఇందులో 90శాతం మంది సామాన్యులే ఇబ్బందులు పడుతున్నారు.

కూతురి పెళ్లికి తీసుకువెళ్తుంటే..



నవంబర్ 19న నా కూతురి పెళ్లి ఉంది. ఈ నెల 11న ఫంక్షన్‌హాల్, బంగారం, బట్టలు తదితర అవసరాల కోసం ఎస్‌బీఐ నుంచి రూ.5 లక్షలు విత్‌డ్రా చేసుకుని వస్తుండగా సీసీసీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. లగ్నం పత్రిక, ధ్రువీకరణ పత్రాలు చూపినా ఇవ్వలేదు. మూడురోజులుగా ఆర్డీవో కార్యాయం, పోలీస్‌స్టేషన్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్న. – కే గంగారాం, నస్పూర్

నీట్-యూజీ సిలబస్ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ
- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్ కట్...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్ తగ్గించలేదు, కానీ సబ్ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్ టాపిక్స్ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్ యూజీ సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు
- కెమిస్ట్రీ ఫస్టియర్: పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్ బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ.
- కెమిస్ట్రీ సెకండియర్: ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- ఫిజిక్స్ ఫస్టియర్: ప్యూర్ రోలింగ్, కనెక్టింగ్ బాడీలు, పాలిట్రోపిక్ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- ఫిజిక్స్ సెకండియర్: పొటెన్షియల్, నాన్ పొటెన్షియల్ సంభావ్యత, ప్రొటెన్షియో మీటర్, ఎర్త్ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్-2: వానపాములు, యూనిట్-5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్-10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
బోటనీ ఫస్టియర్: ప్లాంట్ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్: స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

"సిలబస్ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే." – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ

● బోనాలపై భారీ చిత్రం

1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్తాన్ పోలీసుల లుక్‌అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్: రాజస్తాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్కడి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన 'ఊపిరి' నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్ లంగ్స్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్ వెంటిలేటర్స్ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్ చొరవతో ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్, థొరాసిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేఆర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ చేతన్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్ పలివాల్ వినూత్న కృషి..షార్ట్ ఫిల్మ్‌ను షేర్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్ సుందర్ పలివాల్ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్ కుమార్ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్ ఆఫ్ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్ పలివాల్ కృషిలో భాగస్వామ్యమైన అస్ట్రల్ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను ఎక్స్(ట్విట్టర్)లో సంతోష్ కుమార్ షేర్ చేస్తూ పలివాల్ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు 'సుద్దాల' పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): ప్రజాగాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు– జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, 'మోదుగుపూలు' ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

'బీ థర్మల్' మనుగడ ప్రశ్నార్థకం

- జీవితకాలం ముగిసి 25ఏళ్లు
- ఆధునీకీకరణకు నోచాన్స్
- కొత్త ప్రాజెక్టు ఏర్పాటే ప్రత్యామ్నాయం

రామగుండం: 62.5 మెగావాట్ల సామర్థ్యం గల రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. విద్యుత్ కేంద్రాల జీవితకాలం పాతికేళ్లే అని జెన్‌కో డైరెక్టర్లు ఇటీవల స్పష్టం చేయడంతో అది కాలంచెల్లిన జాబితాలో చేరినట్లయ్యింది.

1965లో శంకుస్థాపన..
- రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్‌టీపీపీ)కి అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి 1965 జూలై 19న శంకుస్థాపన చేశారు.
- రూ.రూ.14.8 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు జవహర్‌లాల్ నెహ్రూ థర్మల్ విద్యుత్ కేంద్రంగా నామకరణం చేశారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఇది తొలి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం.
- అయితే, స్థానికంగా వనరుల లభ్యత సమృద్ధిగా ఉండడంతో కొత్తగా 800 మెగావాట్ల సామర్థ్యం మరో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది.
- దీనిద్వారా నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు ఉత్పత్తి చేసే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

కాలంచెల్లిన జాబితాలో..
- పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా 200 మెగావాట్ల లోపు 25 ఏళ్లపైబడి జీవితకాలం ఉన్న విద్యుత్ కేంద్రాలను కూల్చి, వాటిస్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అధికారాన్ని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి అప్పగించింది. దీంతో కొత్తగూడెంలో ఐదు యూనిట్లను ఇటీవల కూల్చివేసి కొత్తవి స్థాపించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఢిల్లీలోని సీఈఏ చైర్మన్‌ను ఇటీవల కలిశారు. బీ–థర్మల్‌ను సీఈఏ నామ్స్‌కు లోబడి విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, పారామీటర్స్ అంశాలు వివరించారు. దీంతో సీఈఏ గడువు పొడిగించింది.



బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

తరచూ సాంకేతిక సమస్యలు..
- కాలంచెల్లిన ప్రాజెక్టు కావడంతో బాయిలర్ ట్యూబ్స్, మిల్స్, టర్బయిన్ విభాగాల్లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.
- ప్రతీసారి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది.
- పునరుద్ధరణకు విడిభాగాలు లభ్యం కావడం లేదు.
- స్థానిక సాంకేతిక పరిజ్ఞానంతో పునరుద్ధరిస్తున్నా కొద్దిరోజులకే మళ్లీ సమస్యలు తలెత్తుతున్నాయి.
- విద్యుత్ కేంద్రం షట్‌డౌన్ తర్వాత మళ్లీ ఆయిల్ మండించి బాయిలర్ స్టార్టప్ చేసేందుకు సుమారు రూ.20లక్షల వ్యయం అవుతోంది.
- ఇలా ఏటా సుమారు 30సార్లు షట్‌డౌన్ కావడంతో పునరుద్ధరణకే రూ.కోట్లు వెచ్చించాల్సి వస్తోంది.

కొత్త విద్యుత్ కేంద్రం స్థాపనకు అనుకూలతలు..
- బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం తొలగించి, అదేస్థలంలో 500 మెగావాట్ల సామర్థ్యం గల కొత్త పరిశ్రమ ఏర్పాటు చేసే వీలుంది. ఇందుకు అవసరమైన స్థలం, ఇతర వనరుల లభ్యతపై నాలుగేళ్ల క్రితమే జెన్‌కో సర్వే చేసింది. మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి 0.7 ఎకరాలు అవసరముతే.. 500 మెగావాట్ల ప్రాజెక్టుకు 350 ఎకరాలు(ఉద్యోగుల వసతి గృహాలతో కలుపుకొని)అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఏ- కాలనీ నుంచి సీ- కాలనీ అతిథి గృహం వరకు 44.5 ఎకరాలు, ఏ, బీ, సీ కాలనీలతోపాటు పెద్దచెరువు, విద్యుత్ కేంద్రం స్థలంతో కలుపుకొని 390 ఎకరాలు ఉన్నట్లు గుర్తించింది. వీటితో పాటు బూడిద చెరువు 127 ఎకరాలు, వాటర్ రిజర్వాయర్లు ప్లాంట్‌లోని ఖాళీ ప్రదేశాన్ని కలుపుకొని మరో 400 ఎకరాలు ఉన్నట్లు తేల్చారు. ఐదు వందల ఎకరాల విద్యుత్ కేంద్రానికి 100 ఎకరాల బూడిద చెరువు సరిపోతుందని, ప్రస్తుతం బూడిద చెరువు 125 ఎకరాల విస్తీర్ణంలో ఉందని నివేదిక రూపొందించింది.

కొత్తది స్థాపించాలి



బీ థర్మల్ విద్యుత్ కేంద్రం పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని, సాధ్యం కాకుంటే కొత్త పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇప్పటికే దీక్షలు చేశాం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.
– కౌశిక హరి, కార్మిక సంఘం ప్రతినిధి

అందుబాటులో వనరులు



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి బీ–థర్మల్ స్థలంలో స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని కొత్త విద్యుత్ కేంద్రం స్థాపించాలి. తద్వారా రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగవించవచ్చు. – కన్నూరి సతీశ్‌కుమార్, విద్యుత్ కేంద్రం సాధన సమితి చైర్మన్

తక్కువ ధరకే అందుబాటులోకి..
స్థానికంగా నీరు, బొగ్గు అందుబాటులో ఉంది. దీంతో రవాణా ఖర్చు తగ్గుతుంది. తద్వారా విద్యుత్ తక్కువ ధరకే లభ్యమవుతుంది. దీనిమీపంలోనే ఓపెన్‌కాస్టు బొగ్గు గనులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా నీరు, విద్యుత్ కేంద్రం లోపలి వరకు ఇప్పటికే రోడ్డు, రైలు మార్గం.. ఇలా అన్నీ అనుకూలంగా ఉన్నాయి. తద్వారా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి సాధ్యమని ఇంజినీర్లు చెబుతున్నారు.

ముస్తాబైన రాజన్న ఆలయం

వేములవాడ: రాజన్న ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



చకచకా శరన్నవరాత్రి ఏర్పాట్లు

- ముస్తాభైన బాసర ఆలయం
- బారికేడ్లు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది
- ఆలయం ముందు మొరం పోయిస్తున్న అధికారులు
- కోనేరు శుద్ధి చేయాలంటున్న భక్తులు
- రేపటి నుంచే శరన్నవరాత్రి ఉత్సవాలు



బాసర ఆలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

భైంసా: బాసరలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. దసరా వరకు కొనసాగే ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆహ్వానాలు పంపించారు. ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ పెద్దలకు ఆలయ అర్చక బృందం ఆహ్వానాలు ఇచ్చి ఉత్సవాలకు రావాలని కోరారు. ఇక యేట బాసరలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు లక్షలాది భక్తులు వస్తుంటారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఆలయంలో అక్షరాభ్యాసాల సంఖ్య అధికంగా ఉంటుంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఈయేడు కూడా ఆలయ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు దొర్లకుండా, భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

క్యూలైన్లు ఏర్పాట్లు...
బాసర ప్రధాన ద్వారం, ఆలయం, ఆలయ ప్రాంగణం, పరిసరాలు, వేదవ్యాస గుడి ఇలా అన్ని చోట్ల ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. టీటీడీ సత్రం నుంచే స్వాగతతోరణం ఏర్పాటుచేసి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అక్షరాభ్యాసాలు జరిపించి బయటకు వచ్చే భక్తులకు ఇక్కట్లు లేకుండా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

మొరం వేసి...
వసతిగృహాలు, ప్రసాద కౌంటర్‌కు మధ్య బండ రాళ్ల గుట్ట ఉండేది. కొన్ని రోజులుగా ఈ పనులను పూర్తిచేసి బండరాళ్లు తొలగించేశారు. వచ్చే భక్తులకు ఇక్కట్లు లేకుండా ఇక్కడ టిప్పర్లతో మొరం వేయించి చదును చేయిస్తున్నారు.



రాళ్లు తొలగించి మొరం పోస్తున్న దృశ్యం

రంగుమారిన కోనేరు నీరు...
బాసర ఆలయానికి ఆనుకుని కోనేరు ఉంది. వ్యాస మహర్షి ఆలయం బాసర సరస్వతీ ఆలయం మధ్య ఈ కోనేరు కనిపిస్తుంది. చుట్టూ గార్డెన్ ఉండడంతో కోనేరు ఉందన్న విషయం తెలియడంలేదు. 20 ఏళ్ల క్రితం బాసర వచ్చేవారంతా ఈ కోనేరులోనే స్నానాలు చేసేవారు. రానురాను కోనేరు మార్గం మూసి పచ్చని గడ్డి, చెట్లు పెంచారు. వచ్చిన భక్తులంతా నేరుగా ఆలయానికే వెళ్తున్నారు. గతంలో ఈ కోనేరులో దిగి ఇక్కడే నెత్తిపై నీళ్లు చల్లుకుని అమ్మవారి దర్శనానికివెళ్లేవారు. కోనేరు నిర్వాహణ లేక అందులో నీరంతా రంగుమారింది. దగ్గరికి వెళ్లితే పచ్చని రంగుతో కనిపించే నీటి నుంచి దుర్వాసన వస్తుంది. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కోనేటిని శుద్ధిచేయాలని భక్తులు కోరుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం
బాసర ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖులకు ఆహ్వానాలు అందించి బాసర రావాలని కోరాం. బాసర వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. బాసర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాం.
– విజయరామారావు, ఆలయ ఈవో


గోదావరి వద్ద...
బాసర గోదావరి నది వద్ద ప్రధాన స్నానఘట్టాలు ఇప్పుడిప్పుడే శుభ్రంచేస్తున్నారు. ఈయేడు గోదావరి నదిలో వరదనీటిలో నల్లమట్టి బాగా చేరింది. బాసర వంతెన నుంచి సూర్యేశ్వర స్వామి ఆలయం వరకు విశాలంగా ఉన్న స్నానఘట్టాల్లో అంతా స్నానాలుచేస్తారు. నల్లమట్టిలో కాలుజారి నీటిలో పడిపోతున్నారు. అధికారులు ఈ విషయంపై స్పందించి పూర్తిగా నల్లమట్టి తొలగించిన ఘాట్‌ల వద్దే స్నానాలుచేసేలా భక్తులకు సూచనలు ఇవ్వాలి.

ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక వివాదం

- ఎన్నిక చెల్లదన్న 'పత్తిరెడ్డి' పిటిషన్‌పై హైకోర్టు విచారణ
- సంతకాల ఫోర్జరీపై ఫోరెన్సిక్ నివేదికకు ఆదేశం

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక వివాదం కొనసాగుతోంది. ఈ ఎన్నిక చెల్లదని నిర్మల్ జిల్లాకు చెందిన పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు ఫోర్జరీ పత్రాలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. శుక్రవారం విచారణకు రాగా.. ఆ పత్రాలపై సంతకాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పోల్చి నివేదిక ఇవ్వాలని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. 2021 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 24మంది నామినేషన్లు వేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా విఠల్ నిలువగా, బీఆర్‌ఎస్ నిర్మల్ జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పార్టీ ఆదేశాలను ధిక్కరించి నామినేషన్ వేశారు. ఉపసంహరణ రోజు 22 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. తుడుందెబ్బకు చెందిన పెందూర్ పుష్పరాణి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. పోలింగ్ తర్వాత భారీ ఆధిక్యంతో విఠల్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికపై పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో విచారణ కొనసాగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పత్రాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని హైకోర్టు ఆదేశించింది. ఆ సంతకాలను పోల్చి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. తాజా పరిణామాలు రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి.

'కడెం'ను సందర్శించిన జీఆర్‌ఎంబీ అధికారులు



కడెం ప్రాజెక్ట్ వద్ద అధికారులు

కడెం: కడెం ప్రాజెక్టును గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్‌ఎంబీ) కార్యదర్శి ఆరిగేషన్, ఈఈ బత్తుల వెంకటస్వామి శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్ట్ అండర్ గ్రౌండర్ గేట్‌లను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టును సందర్శించామని తెలిపారు. ప్రాజెక్ట్ నీటి మట్టం, ప్రధాన సమస్యలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈలు రవికుమార్, సర్వార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.